క్లుప్తంగా

రాజధానిని రియల్ ఎస్టేట్‌గా చేస్తున్న కూటమి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాజధానిని రియల్ ఎస్టేట్‌గా చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ అన్నారు. గుంటూరులోని ఓ హోటల్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజధాని కట్టడానికి 1,000 ఎకరాలు సరిపోతుందని సీపీఎం రాఘవులు చెప్పారని గుర్తు చేశారు. హైదరాబాద్, మద్రాస్, కర్ణాటక, ఢిల్లీలో ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయని ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్రంలో అమరావతి రాజధానికి ఇప్పటికే ఇప్పటికే 33 వేల ఎకరాలు భూములు తీసుకుని, మళ్లీ 40,000 వేల ఎకరాలు కావాలని అనడం సిగ్గుచేటని ఖండించారు. చంద్రబాబు ఈ గవర్నెన్స్, వాట్సాప్ పరిపాలన తెచ్చినప్పుడు 50 అంతస్తుల భవనాలు ఎందుకని చింతా మోహన్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గ కుప్పంలో ద్రవిడ యూనివర్సిటీలో పనిచేసే ఉద్యోగస్తుల జీతాలు ఇంకా రాలేదని తెలిపారు. చంద్రబాబు నాయుడు చదువుకున్న ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసర్లకు జీతాలు అందలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం పైనా అసంతృప్తి మొదలైందని పేర్కొన్నారు. , సీఎంకి సరైన సలహాదారులు లేరని, రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీపై హర్షం



లక్ష్మీపురం: రెండేళ్లుగా జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టుల్లో 75 మందిని ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయడంపై ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ (సీఐటీయూ) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి. రమణ, గుంటూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు కె. చిన్న వెంకాయమ్మలు జిల్లా పీడీ కె.విజయలక్ష్మిని కలిసి పోస్టుల భర్తీ చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్స్‌గా మార్చాలని, మినీ వర్కర్లకు కూడా వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు.

వీవీఐటీ అమరావతి క్రికెట్ కప్ బ్రోచర్ ఆవిష్కరణ



నగరంపాలెం: నిత్యం విధుల్లో నిమగ్నమయ్యే జర్నలిస్టులకు క్రీడలు ఎంతో ఉపశమనాన్ని అందిస్తాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడేట్ జర్నలిస్ట్ క్రికెట్ పోటీల బ్రోచర్‌ను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 210 మంది అక్రిడేట్ జర్నలిస్టులు పాల్గొనడం గొప్ప విషయమని పేర్కొన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుంటూరు నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్, జేకేసీ కాలేజ్ గ్రౌండ్‌లో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు.


సిలిండర్ల నికర బరువు చెక్ చేసుకోవాలి



నెహ్రూనగర్: కంపెనీ నుంచి గ్యాస్ సిలిండర్లను దిగుమతి చేసుకునేటప్పుడు నికర బరువు చెక్ చేసుకోవాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎం.ఎస్.ఎస్. మాధురి సూచించారు. మే 20న జరిగే ప్రపంచ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ శాఖ అధికారులు ఈ నెల 8వ తేదీ నుంచి 20 వరకు వర్తక సంఘాలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్‌లో ఎల్‌పీజీ డీలర్లు, డెలవరీ బాయ్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లంతా విధిగా ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషీన్‌ను ప్రతి సంవత్సరం ధ్రువీకరించుకోవాలని తెలిపారు. గ్యాస్ సరఫరా చేసే వాహనాలలో ఎలక్ట్రానిక్ కాటాను అందుబాటులో ఉంచుకుని, వినియోగదారులకు నికర బరువును చూపించాలని ఆదేశించారు. బిల్లు ధర కంటే ఎక్కువ వసూలు చేయరాదని ఆమె చెప్పారు.

హైపర్ .. టెన్షన్!

- అధిక రక్తపోటుతో అనర్థాలు
- యుక్త వయస్సులోనే గురవుతున్న యువకులు
- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతో కంట్రోల్
- రేపు వరల్డ్ హైపర్ టెన్షన్ డే





హైపర్ టెన్షన్ డే పోస్టర్లు

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలితో రక్తపోటు (బీపీ) బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగి పోతోంది.చాలా మందికి బీపీ ఉందన్న విషయం తెలుసుకునేలోపే దీని వల్ల కలిగే అనర్థాలతో శరీరంలోని పలు అవయవాలు దెబ్బతింటున్నాయి. 120/80 ఉంటే సాధారణ బీపీగా లెక్కిస్తారు. ఇటీవల చిన్న వయస్సులోనే దీని బారిన పడుతున్నవారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతోంది. ప్రజలకు అవగాహన కలిగించానికి వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్ (డబ్ల్యూహెచ్‌ఎల్) సంస్థ 2005 నుంచి ఏటా మే 17న వరల్డ్ హైపర్ టెన్షన్ డే నిర్వహిస్తోంది. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

సైలెంట్ కిల్లర్

శరీరంలో రక్తాన్ని అన్ని రక్తనాళాలకు గుండె ఒత్తిడి చేసి (ప్రెజర్) పంపిస్తోంది. అధిక వేగంతో రక్తాన్ని ప్రసరింప చేసే శక్తినే బ్లడ్ ప్రెజర్‌గా పేర్కొంటారు. అధిక రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా కూడా వైద్యులు పిలుస్తారు. చాలా మందికి రక్తపోటు లక్షణాలు ఉన్నట్లు కూడా తెలియకపోవడం వల్ల ఉన్నట్టుండి గుండెపోటు వచ్చి కుప్పకూలి పోతారు. తలనొప్పి, అలసట అనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలి. బీపీ చెకప్ చేయించుకోవాలి. పైరెండు లక్షణాలతో పాటు ముక్కు నుండిరక్తం కారడం, ఊపిరి తీసుకోలేకపోవడం, చూపు సక్రమంగా కనిపించకపోవడం, ఛాతీ నొప్పి వంటి లక్షణాలు బీపీ సోకిన వారిలో ఉంటాయి.

కారణాలు

అధిక రక్తపోటు సాధారణంగా వయస్సు మళ్లిన వారికి, కొందరికిజన్యుపరమైన కారణాలతో కూడా వస్తుంది. ధూమపానం, మద్యపానం, ఊబకాయం, పనిచేయకుండా ఒకేచోట గంటల తరబడి ఉండటం, హైపోథైరాయిడ్, ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాలు, సరిపడా నిద్ర, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక మూత్ర పిండాల జబ్బు ద్వారా వస్తుంది. రోజువారి ఆహారంలో ఉప్పును, పచ్చళ్లు ఎక్కువగా తినడం, ప్యాక్ చేసిన నిల్వ చేసిన ఆహార పదార్థాలు తినడం ద్వారా బీపీ బారినపడుతున్నారు. జనరల్ ఫిజీషియన్, కార్డియాలజిస్టు, నెఫ్రాలజిస్టు వైద్యుల వద్దకు చికిత్స కోసం వెళ్లేవారిలో ఎక్కువ శాతం మంది అధిక రక్తపోటు బాధితులే. జిల్లాలో 50 మంది జనరల్ ఫిజీషియన్లు, 30 మంది కార్డియాలజిస్టులు, 20 మంది నెఫ్రాలజిస్టులు చికిత్స అందిస్తున్నారు. వీరి వద్దకు చికిత్సకు వెళ్లే రోగుల్లో 20 నుంచి 30 శాతం మంది అధిక రక్తపోటు బాధితులే.

ఇంటింటికీ వెళ్లి బాధితుల గుర్తింపు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా ఇంటింటికీ వైద్య సిబ్బంది ద్వారా పరీక్షలు చేయించి బాధితులను గుర్తించి, చికిత్స అందిస్తోంది. జిల్లాలో గత ఏడాది నవంబరు నుంచి నేటి వరకు 18 ఏళ్లు దాటిన 10,05,682 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వీరిలో 1,65,553 మంది అధిక రక్తపోటు బాధితులు ఉన్నట్లు జిల్లావైద్య అధికారులు నిర్ధారించారు. స్థానికంగా ఉన్న ఆరోగ్య కేంద్రాల్లోనే వారికి ఉచితంగా మందులు అందిస్తున్నారు.

బీపీతో గుండెకు చేటు



అధిక రక్తపోటు గుండెకు చేటు. చికిత్స కోసం వచ్చేవారిలో 30 శాతం మంది బీపీ వల్ల గుండె పోటుకు గురైన వారే. అధిక రక్తపోటుతో బ్రెయిన్ స్ట్రోక్‌కూడా వచ్చే ప్రమాదం ఉంది. కంటి సంబంధిత సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయి. ప్రతి ఒక్కరూ బీపీపై అవగాహన పెంచుకోవాలి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. బాధితులు తప్పనిసరిగా క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడాలి. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నియంత్రణలో పెట్టుకోవచ్చు.

– డాక్టర్ బి.వి.నారాయణరెడ్డి,
ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్టు, గుంటూరు

కిడ్నీలు పాడయ్యే ప్రమాదం



అధిక రక్తపోటు వల్ల వందలో 20 మందికి కిడ్నీలు పాడవుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 32 లక్షల మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్లు ఎన్‌సీడీ సర్వే ద్వారా వెల్లడైంది. వీరిలో 3.5 లక్షల మంది వరకు కిడ్నీ బాధితులు ఉన్నారు. బీపీ, షుగర్‌లు అదుపులో లేకపోతే కిడ్నీలు దెబ్బతింటాయి. వాటి పనితీరు క్షీణిస్తున్న కొద్దీ క్రియాటిన్ పెరగడం, రక్తపోటు అదుపులో లేకపోవడం జరుగుతుంది. బీపీ ఉన్న వారు వ్యాధిపై అవగాహన కల్గి ఉండి, జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి దరి చేరదు. బీపీ ఉన్న ప్రతి ఒక్కరు ముందస్తుగా కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు పాటించాలి.

– డాక్టర్ చింతా రామకృష్ణ,
సీనియర్ నెఫ్రాలజిస్టు, గుంటూరు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): రూరల్ మండలంలోని బుడంపాడు గ్రామ పరిధిలో హెచ్‌టీ లైన్ మరమ్మతుల దృష్ట్యా బుడంపాడుతో పాటు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్‌కు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–1 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ ముస్తాక్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పారిశ్రామిక శిక్షణ కేంద్రం (డీఎల్‌టీసీ) అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయి వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని డీఎల్‌టీసీ, ఐటీఐల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, మెకానిక్ మోటార్ వెహికల్ కోర్సులలో ప్రవేశానికి ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈనెల 24లోపు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐకు వెళ్లి, ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలని ఆయన సూచించారు. టెన్త్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు టెన్త్ ఒరిజినల్ మార్కుల జాబితా, టీసీ, రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులు రెవెన్యూ శాఖ జారీ చేసిన ధ్రువపత్రం, తల్లిదండ్రులతో పాటు విద్యార్థి ఆధార్ కార్డు, ఈ–మెయిల్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, మొబైల్ నంబరు వివరాలు వెంట తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న డీఎల్‌టీసీలో నేరుగా లేదా 0863–2234720, 83339 73929 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పాలిసెట్‌లో ప్రతిభ చూసిన విద్యార్థినికి అభినందన



అన్యూన్యను అభినందిస్తున్న తిలక్‌బాబు, విజయకృష్ణ, సీతారామయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2025 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 326వ ర్యాంకు, జిల్లాస్థాయిలో మూడో స్థానంలో నిలిచిన విద్యార్థిని కాకుమాను అన్యూన్యను ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు అభినందించారు. విద్యానగర్‌లోని ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ సంయుక్తంగా ఇచ్చిన ఉచిత పాలిసెట్ శిక్షణ పొందిన అన్యూన్య రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ అచీవర్స్ కార్యదర్శి కొండపనేని విజయకృష్ణ మాట్లాడుతూ ఉచిత శిక్షణ పొందిన 243 మంది విద్యార్థులందరూ పాలిసెట్‌లో క్వాలిఫై కావడంతో ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించేందుకు స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ విజయంతో ఏటా శిక్షణ కొనసాగిస్తామని తెలిపారు. విద్యార్థినిని అభినందించిన వారిలో ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల అడ్మిన్ మేనేజర్ బండారు సీతారామయ్య ఉన్నారు.

దస్తావేజులు తాకట్టు పెట్టి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

లక్ష్మీపురం: ఇంటి ఖర్చుల నిమిత్తం దస్తావేజులు తాకట్టు పెట్టి అప్పుగా తీసుకున్న వాటిని మరలా బ్యాంక్‌లో పెట్టి అధిక మొత్తంలో నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తి పై అరండల్‌పేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిటిపాడు హనుమయ్య నగర్ ప్రాంతానికి చెందిన షేక్ ఖాసింబి, భర్త వలి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఆర్థిక సమస్యల నేపథ్యంలో విజయవాడ ఎ.ఎస్.ఆర్ వీధి, మారుతీ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ జానీ బాషా వద్ద 2015లో రూ.5లక్షలను దస్తావేజులు తాకట్టు పెట్టి అప్పుగా తీసుకున్నారు. ప్రతి నెలా వడ్డీ చెల్లించుకుంటూ వస్తున్నారు. అయితే, ఈ క్రమంలో ఇంటి దస్తావేజులు వాపసు తీసుకునేందుకు జానీబాషాను అడగ్గా కాలయాపన చేస్తున్నాడు. అనుమానం కలిగి ఆరా తీయగా జానీ బాషా బ్యాంక్‌లో దస్తావేజులు పెట్టి రూ.19 లక్షలు రుణం తీసుకున్నాడని తెలుసుకున్నారు. దస్తావేజులను అడిగితే బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలుషేక్ ఖాసింబి దిక్కుతోచక అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణతో విద్యార్థుల్లో సృజనకు పదును



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న దుర్గాశ్యామ్, విష్ణువర్ధన్, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి శిక్షణ శిబిరం ద్వారా విద్యార్థుల్లో సృజనకు పదును పెట్టవచ్చని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అన్నారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో గత నెల 24 నుంచి నిర్వహించిన శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు తాము నేర్చుకున్న సాంస్కృతిక కళలను ప్రదర్శించారు. ప్రధానంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల త్యాగానికి గుర్తుగా ఆపరేషన్ సిందూర్ నాటక ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. విష్ణువర్ధన్ మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో భాగంగా టెర్రరియం, వావ్, ఆర్ట్–క్రాఫ్ట్, యోగా, మ్యూజిక్, క్లాసికల్–వెస్టర్న్ డాన్స్, ఏరోబిక్స్, స్కేటింగ్, కాలిగ్రఫీ, థియేటర్, ఫన్ విత్ మాథ్స్–సైన్స్‌తో పాటు ఏఐ, రోబోటిక్స్ గురించి విద్యార్థులకు వివరించారు విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా రోబోటిక్స్, కోడింగ్, మేధస్సును పెంచే చెస్ తదితర శిక్షణ తరగతుల ద్వారా సృజనాత్మకత పెంపొందుతుందని వివరించారు. ఈ దర్భంగా మెరుగైన ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతి, సీనియర్ కో–ఆర్డినేటర్ దోసకాయల దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



ఎన్‌సీసీ కేడెట్లతో జూపూడి రంగరాజు, మధుసూదనరావు, నాగభూషణం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో గత ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్‌సీసీ 'బీ' సర్టిఫికెట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడారు. పరీక్షకు హాజరైన 17 మందిలో 10 మంది ఏ గ్రేడ్, ఏడుగురు బీ గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. అత్యుత్తమ శిక్షణ, క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ పొందిన విద్యార్థులు జాతీయ భావం, క్రమశిక్షణ, దేశభక్తి కలిగి ఉంటారన్నారు. 'బీ' సర్టిఫికెట్‌లో ఉత్తీర్ణులైన కేడెట్లకు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ. ప్రత్యూష, ఓఎస్డీ పి.సీతారామయ్య, ఎన్‌సీసీ ఏఎన్‌వో లెఫ్టినెంట్ సీహెచ్. అజిత్‌బాబు పాల్గొన్నారు.

రేపు తిరంగా ర్యాలీ

గుంటూరు మెడికల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన నేపథ్యంలో ఈనెల 17న భారీ ర్యాలీగా తిరంగా యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కూటమి నేతలు తెలిపారు. గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయం ఎన్డీయే కూటమి విజయంగా పేర్కొన్నారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు హిందూ కాలేజ్ సెంటర్ నుంచి లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు తిరంగా యాత్ర జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొన్నారు.

రవికుమార్‌కు వైకే పురస్కారం ప్రదానం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గురువారం ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువకళా వాహిని ఆధ్వర్యంలో వైకే నాగేశ్వరరావు జయంతి సందర్భంగా నిర్వహించిన సభకు యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. డాక్టర్ నరాలశెట్టి రవికుమార్‌కు వైకే ఆత్మీయ పురస్కారం ప్రదానం చేశారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, రామరాజు ఫౌండేషన్ నిర్వాహకులు రామరాజు శ్రీనివాసరావు, పాలక మండలి సహ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు, శారద కళాసమితి అధ్యక్షులు దోగిపర్తి శంకరరావు, అప్కాబ్ బ్రాంచ్ మేనేజర్ పి.లక్ష్మీసువర్చల, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య మాట్లాడారు. అనంతరం డాక్టర్ నరాలశెట్టి రవికుమార్ బృందం సత్యహరిశ్చంద్ర నాటకం నుంచి వారణాసి, కాటిసీను ఘట్టాలను, పద్యాలతో నాటకాభిమానులను అలరించారు. కార్యక్రమంలో లంక లక్ష్మీనారాయణ, బొప్పన నరసింహారావు, శివశంకరశాస్త్రి, ఏంఎ.హమీద్, జి.మల్లికార్జునరావు, జానీ బాషా పాల్గొన్నారు.

దోమల నివారణతో డెంగ్యూకు చెక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తదితరులు

గుంటూరు మెడికల్: జాతీయ డెంగ్యూ దినోత్సవం (ఈనెల 16న) సందర్భంగా గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో అవగాహన పోస్టర్లను డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిదని చెప్పారు. నివారణ చర్యల్లో భాగంగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలని, దోమతెరలు వాడాలని, ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి శుక్రవారం అన్ని ఆరోగ్య కేంద్రాల్లో డెంగ్యూపై ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. గుంటూరులో లాలాపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటలకు ర్యాలీ నిర్వహిస్తామని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ ఈ. అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, వైద్యులు విజయప్రకాష్, జయరామకృష్ణ, ప్రియాంక, అబూబకర్, గిరిధర్, డెప్యూటీ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, డీపీఓ సైమన్, ఆరోగ్యవిస్తరణ అధికారి శివగణేష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ

గుంటూరు మెడికల్: వృద్ధులు, అనాథలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని హైదరాబాద్‌కు చెందిన రిలైబుల్ ట్రస్టు నిర్వాహకుడు రవి కోరారు. గురువారం స్థానిక పట్టాభిపురంలోని అనురాగ్ ఓల్డేజ్ హోమ్ ఆశ్రమానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, కూలర్లు, ఫ్యాన్లు, టీవీ, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్న ఓల్డేజ్ హోమ్ నిర్వాహకురాలు అనంత స్వాతిని అభినందించారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకురాలు స్వాతి, సభ్యులు రవిని అభినందించారు. కార్యక్రమంలో ఆశ్రమ వృద్ధులు పాల్గొన్నారు.

ఖాజీల సమస్యల పరిష్కారానికి కృషి

ఆంధ్రప్రదేశ్ మైనారిటీ వ్యవహారాల సలహాదారులు ఎస్.ఎం.షరీఫ్



మాట్లాడుతున్న షరీఫ్

లక్ష్మీపురం: రాష్ట్రంలో ఖాజీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ వ్యవహారాల సలహాదారులు ఎస్.ఎం.షరీఫ్ అన్నారు. గుంటూరు ఆంధ్ర ముస్లిం కళాశాలలో గురువారం హాజీల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ ఖాజీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఖాజీ రిజ్వాన్ మాట్లాడుతూ ముస్లింల వివాహ సందర్భంగా ఖాజీలు ఇచ్చే ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం పలు విభాగాలు పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెడ్, గ్రీన్ జోన్‌లుగా విభజించి ఖాజీలు ఉన్నచోట కాకుండా లేని ప్రాంతాల్లో నూతనంగా నియామకాలు చేపట్టాలని ఆయన కోరారు. ఖాజీల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన చోట ప్రత్యేకంగా ఖాజీ బోర్డును ఏర్పాటు చేయడం ద్వారా, ముస్లిం మైనార్టీల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు మార్గాలు సుగుమం అవుతాయని పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు నసీర్ అహ్మద్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, ముస్లిం మైనారిటీ నాయకులు, ఖాజీల సంఘం నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో చర్మ సమస్యలకు లేజర్ చికిత్స



పరికరాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ యశశ్వి రమణ, ప్రిన్సిపాల్ సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో చర్మ వ్యాధి వైద్య విభాగంలో బొల్లి, తెల్ల మచ్చలు, సొరియాసిస్ వంటి చర్మవ్యాధులకు లేజర్ ఎగ్జామ్ ద్వారా చికిత్స చేసేందుకు రూ. మూడు లక్షల విలువైన పరికరాన్ని జీడీవీల్ గుంటూరు అసోసియేషన్ వితరణగా అందజేసింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని వైద్య పరికరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకూ చర్మ సంబంధిత సమస్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రాథమిక దశలోనే వాటిని గుర్తించి ఆధునిక చికిత్స అందించేందుకు నూతన వైద్య పరికరాలు అందజేయడం అభినందనీయమన్నారు. కాస్మోటిక్, లేజర్ చికిత్సలు జీజీహెచ్‌లో పేద ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చర్మవ్యాధుల వైద్య విభాగాధిపతి డాక్టర్ మోహన్‌రావు, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

జాహ్నవి అంతరిక్ష పరిశోధనల్లోనూ ఎదగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: అంతరిక్ష పరిశోధనల్లో జాహ్నవి దంగేటి ధ్రువతారగా ఎదగాలని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి అన్నారు. యూఎస్ఏ అలబామాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో నాసా అంతర్జాతీయ వాయు, అంతరిక్ష శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న ఘనత సాధించిన జాహ్నవిని గురువారం అమరావతి రోడ్డులోని సంస్థ కార్యాలయంలో శాంతమూర్తి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాహ్నవి తమ స్పేస్ క్లబ్‌లో గౌరవ సభ్యురాలిగా చేరారని, భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనల ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.